21012025-MAI-04_Layout 1 1/21/2025 2:51 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## రైతన్నల మృత్యుఘోష

**అన్నదాతల** యోగక్షేమాల కోసం అహరహం తపించిన కేసీఆర్ పాలనలో బాగుపడిన సాగు నేడు తిరోగమిస్తున్నది. కయ్యాలమారి కాంగ్రెస్ పాలనలో సేతానం ఆగమాగమైతున్నది. పంటసాయం, రుణమాఫీ, జలసిరి, కొనుగోళ్ల దూకుడుతో వెలిగిపోయిన రైతుల పదేండ్ల ప్రాభవం కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన ఒక్క ఏడాదిలోనే అడుగంటింది. సర్కారు చేయూత కానరాక, సాగు సరిగా సాగక సేద్యం విలవిలలాడుతున్నది. ధాన్యపు సిరులతో ధగధగలాడిన పంట పొలాలు మరు భూములుగా మారుతున్నాయి. కాంగ్రెస్ కల్లబొల్లి హామీలతో మోసపోయిన రైతు గోస పడుతున్నాడు. అన్నివైపులా సమస్యలు చుట్టుముట్టడంతో అన్నదాత మనసు చెడి ఆత్మహత్యే శరణ్యమంటున్నాడు. అన్నపూర్ణగా విశ్వవీధుల్లో వినుతులందుకొన్న గడ్డ మీద రైతన్నల మృత్యుఘోష మిన్నంటుతున్నది. కాంగ్రెస్ 400 పైచిలుకు రోజుల పాలనలో రోజుకో రైతు బలవన్మరణానికి బలవుతున్నాడు. మరో 'రైతు ఆత్మహత్య' అనేది పత్రికల్లో నిత్యశీర్షికలా మారింది. కాంగ్రెస్ మోసకారి పాలన అమల్లోకి వచ్చిన 2023 డిసెంబర్‌లో ఏడుగురు రైతులు ఆత్మహత్య చేసుకుంటే, ఏడాది పాలన పూర్తయిన 2024 డిసెంబర్‌లో ఆ సంఖ్య 45కు పెరగడం దేన్ని సూచిస్తున్నది?

అసమర్థతతో, అనాదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల మరణానికి కారణమవుతున్నదనేది అక్షర సత్యం. డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయి. దేవుళ్ల మీది ఒట్టును తీసి గట్టున పెట్టారు. కౌలు రైతు సాయం అతీ గతీ లేకుండాపోయింది. రుణమాఫీ దారుణ పరిహాసమైంది. అరకొరగా అమలుచేసి చేతులు దులిపేసుకున్నారు. రూ.2 లక్షల లోపు రుణాలమాఫీ పూర్తి చేసినట్టు సర్కారు గొప్పలు చెప్పుకున్నది. కానీ, ఆచరణలో 40 శాతం మందికి కూడా పూర్తికాకపోవడం కఠోర సత్యం. మరోవైపు భరోసా నయవంచనైంది. పెంచుతామన్న పంట సాయం పెంచకపోగా వానకాలం మొత్తానికే ఎగ్గొట్టడంతో రైతు రుణభారం కింద నలిగిపోయాడు. పగలతో, సెగలతో ప్రాజెక్టులను పండబెడితే కళకళలాడిన నీటవనరులు వెలవెలబోతున్నాయి. చెరువులు వట్టిపోయి భూగర్భ జలాలు లోలోతుల్లోకి జారిపోతున్నాయి. వీటన్నిటి ఫలితంగా నీళ్లందక పొలాల గొంతులెండుతున్నాయి. పంట కొనుగోళ్లలో జాప్యంతో పరిస్థితి మరింతగా దిగజారింది. బోనస్ బోగస్ అయ్యింది. అప్పులు కుప్పలయ్యాయి. ఆశలు అడుగంటాయి.

సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న రైతు మరణమే మేలనుకునే స్థితికి చేరుకున్నాడు. ఇందుకు బాధ్యత వహించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన సర్కారు మాత్రం మొద్దు నిద్ర నటిస్తూ బుకాయింపులతో, అసత్య ప్రచారాలతో కాలయాపన చేస్తుండటం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. ఆరుగాలం అరిగోస పడి పంటలు పండించి, ఆకలి తీర్చే రైతుల ఓపిక నశిస్తున్నది. అయితే ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావనేది రైతులు గుర్తెరగాలి. మాటతప్పిన సర్కారు మెడలు వంచాలి. హామీలను సాధించాలి. ఆత్మ బలిదానాలతో హృదయం లేని సర్కారులో పరివర్తన వస్తుందని ఆశించలేం. హామీల అమలుకు అడుగడుగునా నిలదీయడం, పోరాటం చేయడం ఒక్కటే మార్గం.

# సీఎం రేవంత్ సాహస యాత్రలు!

ఒక విషయం ముందే చెప్పాలి. ఇక్కడ రాస్తున్నది సింద్‌బాద్ సాహసయాత్రల గురించి కాదు. బాగ్దాద్‌కు చెందిన సింద్‌బాద్ అనే నావికుని సాహస యాత్రలు, ఆయన ఆ క్రమంలో చూసిన అద్భుతాలు, సాధించిన విజయాల గురించిన కథలు అందరికీ తెలిసినవే. అవి ఎంతోకాలం క్రితంవి అయినా నేటికీ ప్రపంచం అంతటా పాఠకులను చిన్నా పెద్దా తేడా లేకుండా అలరిస్తూనే ఉంటాయి. ఇప్పుడు మనం తెలుసుకునేది తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సాహసయాత్రల గురించి. ఆ కథలు కూడా అందరినీ అలరించదగినవే. అయితే అవి మామూలు అర్థంలో సింద్‌బాద్ వంటి సాహస యాత్రలు కాదు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలంటే, అవి అసత్య యాత్రలు. లేదా అసత్య ప్రచార యాత్రలు. అసత్య ప్రచారాలు కూడా సాహసంతో కూడుకున్నవేనని, కనుక వాటిని సాహసయాత్రలని ఎందుకు అనకూడదని ఎవరైనా ప్రశ్నించవచ్చు. అందుకు మన వద్ద సమాధానం లేదు.



టంకశాల అశోక్

ఇప్పుడు విషయంలోకి వెళ్దాం. రేవంత్‌రెడ్డి ఈ నెల 16న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అయిన కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు. అందులో భాగంగా, అక్కడి అధికారపక్షమైన ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేగలమని ప్రకటించారు. ఆ మాట విని ఆనందం కలిగింది. ఎందుకంటే, దేశానికి స్వాతంత్ర్యం సాధించిన పార్టీ దేశ రాజధానిలో అధికారాన్ని కూడా సాధించటమంటే అంతకన్న వేరే భావన ఎందుకు కలుగుతుంది. అయితే, అక్కడ కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో లేని మాట అకస్మాత్తుగా గుర్తుకువచ్చింది. అయినప్పటికీ, గత ఎన్నికల్లో ఏదో కొద్ది సీట్ల తేడాతో అధికారాన్ని కోల్పోయి ఉంటుందనిపించింది.

> **కచ్చితమైన సీట్ల అంకెలు వెంటనే గుర్తుకురాలేదు. కనుక అట్లా అనిపించటం సహజమే కదా. పైగా, స్వయంగా ఒక రాష్ర్టానికి ముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న నాయకుడు ఆ మాట అంత భరోసాగా ప్రకటించినప్పుడు, అందుకు తగిన విలువ ఇవ్వకుండా ఎట్లా ఉండగలం?**

ఈ విధమైన సద్బుద్ధి కలగటంతో ఎందుకైనా మంచిదని ఒకసారి గత ఎన్నికల ఫలితాలను చూడగా కనిపించింది ఈ విధంగా ఉంది. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం స్థానాలు 70. అందులో



ఆమ్ ఆద్మీకి లభించినవి 62. బీజేపీ గెలుచుకున్నవి 8. కాంగ్రెస్ పక్కన '0' కనిపించి ఉలిక్కిపడ్డాను. నమ్మలేక ఎన్నిసార్లు తనిఖీ చేసినా మార్పు లేదు. ఇక ఏమి చేయాలో తోచక అంతకన్న ముందటి 2015 ఎన్నికల ఫలితాలను గమనించగా అక్కడ కూడా ఎటువంటి మార్పు లేకుండా సున్నాయే కనిపించింది. దానితో హతాశుడిని కాగా ఇక తక్కిన పార్టీల సంగతి తెలుసుకోవాలనిపించలేదు. అందువల్ల ప్రయోజనం మాత్రం ఏమున్నది గనుక?

ఇంత జరిగినా ఒక చిరు ఆశ మాత్రం మిణుకు మిణుకుమంటూ, నదికి ఆవలి గట్టున దీపం వలె తోచింది. అది ఏమంటే, రేవంత్ రెడ్డి వంటి నాయకుడు ఒక మాటను ఉబుసుపోకకు అనరు. అది కూడా నలుగురు మిత్రులతో డ్రాయింగ్ రూములో కూర్చుని కబుర్లాడుకుంటున్నప్పుడు తప్ప, బహిరంగ సభలో ఎంతో జాగ్రత్తగా మాట్లాడతారు. ఒక్కొక్క మాటను ఆచి తూచి. అటువంటి స్థితిలో గత రెండు ఎన్నికల ఫలితాలు తెలిసి కూడా (తనకు స్వయంగా గుర్తు లేకున్నా స్పీచ్ రైటర్లు గాని మరొకరు గాని చెప్పే ఉంటారని భావించాలి) ఈసారి కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని బల్ల గుద్దారంటే, అటువంటి ఆత్మ విశ్వాసం లేనిదే ఆ పనిచేయరు గదా.

ఈ ఆలోచనతో ఆ నాటి తన ప్రసంగాన్ని జాగ్రత్తగా శోధించినప్పుడు కొన్ని అంశాలు దృష్టికి వచ్చాయి. అది కూడా ఆయనకు అనుకూలమని పేరుబడిన పత్రికలలో. ఆ విధంగా కనిపించినవి ఈ విధంగా ఉన్నాయి. తమ ప్రభుత్వం తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసింది. అదే ప్రకారం తమ పార్టీ ఢిల్లీలోనూ అమలుచేస్తుంది. అది కూడా తెలంగాణ స్ఫూర్తితో. ఢిల్లీ హామీల అమలుకు భరోసా తనదే. ఈ మాటలు అంటూ, తెలంగాణలో ఆరు గ్యారెంటీల డాక్యుమెంట్ తరహాలో ఢిల్లీ ప్రజల కోసం కూడా గ్యారెంటీల పోస్టర్ ఒకటి ఆవిష్కరించారు. వాటిని తర్వాత తెలంగాణలో వలెనే బాండ్ పేపర్‌గా మార్చి ఇంటింటికి తిరిగి పంచుతారేమో తెలియదు. ఇది తప్పక తెలుసుకోవలసిన ఒక్క ముఖ్య విషయం. అన్నట్టు ఆయన తెలంగాణ యువతకు తాము అధికారానికి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కొత్తగా సృష్టించి, వాటికి నోటిఫికేషన్లు కూడా తామే జారీచేసి, నిరుద్యోగులకు నియామక పత్రాలు ఇచ్చి వేసినట్టు కూడా నూటా ఒకటవ సారి చెప్పినట్టున్నారు. అదేవిధంగా, తమ మ్యానిఫెస్టో హామీ ప్రకారం మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలన్న లెక్కలో ఇప్పుడు ఏడాది పూర్తయ్యాక ఇక మిగిలింది లక్షా నలభై అయిదు వేలు మాత్రమేనని కూడా అన్నట్టున్నారు. ఇదింకా పత్రికల్లో చెక్ చేయాల్సి ఉన్నది.

> **ఇవన్నీ ఎట్లున్నప్పటికీ, అంతమాత్రాన కాంగ్రెస్ బలాన్ని 0/70 నుంచి 36/70కి పెంచి అధికారాన్ని అప్పగించేందుకు ఢిల్లీ వాసులు అమాయకులా? కారని రేవంత్‌రెడ్డికి బాగా తెలుసు. భోజనం ఎంత షడ్రసోపేతమైనా ఆఖరున 'మాల్ మసాలా' తప్పదని అనుభవంతో తెలుసుకున్న విషయం. కనుక, 'ఆప్' ఒక లిక్కర్ పార్టీ అని, దానిని ఓడించగలమని ఘాటైన ప్రకటన చేశారు. అందువల్ల, ఫిబ్రవరి 8న ఎన్నికల ఫలితాలు వెలువడినప్పుడు, కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధించి, 15 ఏండ్ల సుదీర్ఘ వ్యవధి తర్వాత తిరిగి అధికారానికి రాగలదని, ఆ విధంగా రేవంత్‌రెడ్డి ప్రతినను ఢిల్లీ ఓటర్లు మన్నించగలరని తప్పకుండా నమ్మవచ్చు.**

అంతకన్న మార్గాంతరం లేదు కూడా. ఎందుకంటే, రేవంత్ రెడ్డి ఇదే విధమైన సాహసయాత్ర ఒక్కటి చేసి తమ పార్టీ కోసం ఘన విజయం సాధించిన ఉదాహరణ ఒకటి ఇటీవలి మహారాష్ట్ర ఎన్నికలు. అక్కడ ఆయన పత్రికలలో అడ్వర్టయిజ్‌మెంట్లు, మీడియా సమావేశాలు బహిరంగ సభల ప్రసంగాల ద్వారా, తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలుచేసినట్టు, 55 వేల ఉద్యోగాలు సృష్టించి ఇచ్చినట్టు బాగా ప్రచారం చేశారు. అక్కడ కాంగ్రెస్ ఇచ్చిన ఏడు గ్యారెంటీల అమలు బాధ్యత తనదన్నారు. అదంతా ఓటర్లు నమ్మే ఉంటారు. దానితో, ఇక తమకు అధికారం గ్యారెంటీ అని 'ఇండియా' కూటమి కూడా గాఢంగా నమ్మింది. చివరికి తక్కిన ఫలితాల మాట అట్లుంచితే, కాంగ్రెస్ సీట్లు 2019 నాటి 44 నుంచి 16కు పడిపోయాయి. తెలంగాణ వారు పెద్ద సంఖ్యలో ఉన్నారనే సుమారు 10 స్థానాలలో ఆయన ప్రచారం చేయగా, అందులోని సున్నా శూన్యంలో కలిసిపోయి ఒకటింట మాత్రం గెలిచినట్లున్నారు. ఆ ఒక్కటైనా రావటానికి మాత్రం రేవంత్ బలమైన ప్రచారం, తెలంగాణలో హామీల అమలు కారణాలని నమ్మకంగా చెప్పవచ్చు.

ఈ విధమైన సాహస యాత్రల ద్వారా మహారాష్ట్రలో అధికారం పట్ల ఆశలు కల్పించి, ప్రస్తుతం ఢిల్లీలోనూ కల్పిస్తున్న రేవంత్ రెడ్డి, ఇక భవిష్యత్తులోకి దీర్ఘదృష్టిని సారిస్తూ జరుపవలసిన బృహత్కార్యం ఒకటున్నది. అది, ఎందువల్లనైతేనేమి కకావికలమవుతున్న 'ఇండియా' కూటమిని పటిష్ఠపరిచి, దాని నాయకత్వ స్థానంలో ప్రమాదకరంగా ఊగిసలాడుతున్న తమ పార్టీ ఆధిపత్యాన్ని సుస్థిరం చేయటం. ఆ తర్వాత, రానున్న మాసాలు, సంవత్సరాలలో జరుగనున్న వివిధ రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల కోసం కూడా ఇదే విధంగా సాహస యాత్రలు చేసి కాంగ్రెస్ విజయానికి మూలకారణం కావటం. ఇంకా తర్వాత, 2029 లోక్‌సభ ఎన్నికలలో, ఆ పార్టీని (ఢిల్లీ వలెనే) 15 ఏండ్ల పిదప తిరిగి కేంద్రంలో అధికారానికి తేవటం. అప్పుడుగాని ఆయన సాహసయాత్రల అంతిమ ఫలితం సిద్ధించదు. అప్పుడు, సింద్‌బాద్ వలెనే తన యాత్రా కథనాలను కూడా రచయితలు వర్ణించగా, గాయకులు కీర్తించగా, చిత్రకారులు రంగులలో చిత్రించగా, అవి రాజకీయ జానపద సాహిత్యంగా శాశ్వతంగా నిలిచిపోతాయి. ఆయన కీర్తి ఆచంద్రతారార్కమవుతుంది.

> **2029 లోక్‌సభ ఎన్నికలలో, ఆ పార్టీని (ఢిల్లీ వలెనే) 15 ఏండ్ల పిదప తిరిగి కేంద్రంలో అధికారానికి తేవటం. అప్పుడుగాని ఆయన సాహసయాత్రల అంతిమ ఫలితం సిద్ధించదు. అప్పుడు, సింద్‌బాద్ వలెనే తన యాత్రా కథనాలను కూడా రచయితలు వర్ణించగా, గాయకులు కీర్తించగా, చిత్రకారులు రంగులలో చిత్రించగా, అవి రాజకీయ జానపద సాహిత్యంగా శాశ్వతంగా నిలిచిపోతాయి. ఆయన కీర్తి ఆచంద్రతారార్కమవుతుంది.**

# ఎవుసానికి ఏదీ భరోసా?

సుమారు ఏడాదిన్నర కిందట ఏసీ రూముల్లో కూర్చున్న కొందరు కాంగ్రెస్ నాయకులు ఎంతో మేధోమథనం చేసినట్టుగా హంగామా చేశారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలనే కాపీ చేస్తూ, వాటికి అదనంగా 2 నుంచి 5 వరకు అంకెలు జతచేస్తూ ఓ మ్యానిఫెస్టోను రూపొందించారు. ఉదాహరణకు ఆసరా పింఛన్ రూ.2 వేలుంటే, వాళ్లు రూ.4 వేలు ఇస్తామన్నరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబంధు రూ.10 లక్షలు ఇస్తే, తాము రూ.12 లక్షలు ఇస్తామని ప్రగల్భాలు పలికారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కూడా ఇస్తామని హడావుడి చేశారు. ఇట్లా చెప్తూ పోతే ఈ పత్రికలో స్థలం సరిపోదేమో!



డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్



ఇగొచ్చె.. అగొచ్చె.. అంటూ అసలు ప్రజలకు ఆలోచించడానికి కూడా సమయం ఇవ్వకుండా హామీలిస్తూ పోయారు. ఇక డిక్లరేషన్లకైతే అంతే లేదు. ఆ ఊళ్లో ఒక డిక్లరేషన్. ఈ ఊళ్లో ఒక డిక్లరేషన్. వాటి పేరుతో వందల కొద్దీ హామీలు. ఫైనల్‌గా ఆరు గ్యారెంటీలు అనబడే 13 హామీలు గుదిగుచ్చి అందరి మెడల్లో వేశారు. అన్నింటికీ మించి ఏ రంగం స్థిరీకరణ కోసం, ఏ రంగం అభివృద్ధి కోసం, ఏ రంగాన్ని ఉన్నతీకరించడం కోసం దశాబ్ద కాలం రేయింబవళ్లు గత ప్రభుత్వం పనిచేసిందో, ఆ వ్యవసాయ రంగంపైనా, దాని అనుబంధ రంగాలపైనా కల్లాలలో కుప్పలు తెచ్చి పోసినట్టే హామీలు గుప్పించారు. రుణమాఫీ రూ.2 లక్షలన్నరు. రైతు భరోసా రూ.15 వేలన్నరు. ఇది కౌలు రైతులకూ ఇస్తమన్నరు. రైతు, ఉపాధిహామీ కూలీలకూ రూ.12 వేలు ఇస్తమన్నరు. రాష్ట్రంలో పండే ప్రతి పంటకూ ఓ ఐదొందల బోనస్ ఇస్తమన్నరు. ఇవన్నీ విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురి కాని వారు బహుశా లేరేమో. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కానీ, తత్త్వం బోధపడలేదు. ఎన్నికల ముందు రైతుబంధు వేస్తుంటే ఎన్నికల సంఘానికి ఉత్తరాల మీద ఉత్తరాలు రాసి ఆపించారు. వచ్చాకైనా వేశారా అంటే.. వాటిని వేయడానికి నాలుగు నెలల ప్రహసనాన్ని నడిపించారు. ఇక రుణమాఫీ అయితే ఒట్టుల బుట్టలా మారింది. ప్రభుత్వాధినేత పెట్టిన ఒట్లకు దేవుళ్లు సైతం ఆశ్చర్యపోయారేమో. ఇక్కడినుంచి గందరగోళం మొదలైంది. రాష్ట్ర ఆర్థిక వనరులను అభివృద్ధి, సంక్షేమం కోసం ఏ విధంగా వికేంద్రీకరించాలి? దేనికి ఏ మేరకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియని ప్రభుత్వాధినేతలు అయోమయంలో పడిపోవడంతో రాష్ట్రంలో ఎవుసానికి భరోసా లేకుండాపోయింది. 2023, డిసెంబర్ 9న రుణమాఫీ హామీ అమలు చేస్తామన్న ప్రభుత్వం అలాంటి తేదీలెన్నింటినో దాటవేసింది. ఆఖరికి రుణమాఫీ అమలు కోసం సవాలక్ష ఆంక్షలు పెట్టింది. ఇదంతా కొంత కాలం సాగదీసే యత్నమే తప్ప మరేం కాదు. రుణమాఫీ మూడు దశల్లో చేసినప్పటికీ ఇంకా నూరు శాతం పూర్తి కాలేదు. పాలమూరులో పెద్ద సభ పెట్టి రూ.2,750 కోట్ల చెక్కునిచ్చి ఇక దీంతో నూరు శాతం రుణమాఫీ పూర్తయిందని సీఎం స్వయంగా ప్రకటించారు. వాస్తవానికి ఆ రూ.2,750 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ కానే లేదు. రైతు భరోసా నిధులను రుణమాఫీకి బదలాయించి దానిని మమ అనిపించారు.

ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల సమయం వచ్చింది. కాబట్టి తప్పనిసరిగా రైతు భరోసాను ఇస్తమన్నరు. రైతు కూలీలకు 12 వేల లెక్కన నగదు ఇస్తమన్నరు. మళ్లీ ఇక్కడ రాజకీయ విన్యాసాలు మొదలయ్యాయి. రైతు భరోసాను గత ప్రభుత్వం రాళ్లు రప్పలకు ఇచ్చి దుబారా చేసింది. తాము, రైతులకే ఇస్తమని ఊదరగొట్టారు. దీనిపై ఓ కమిటీ వేసి నివేదిక తెప్పించుకున్నారు. కానీ, ఆ నివేదిక మాటెట్లా ఉన్నా.. అసెంబ్లీలో దానిపై ఒక చర్చ పెట్టి మమ అనిపించారు. తర్వాత క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించి తీసుకున్న నిర్ణయం ఏమిటయ్యా అంటే.. రైతు భరోసా రూ.15 వేలు కాదు, రూ.12 వేలేనని. రైతులకు ఇంత ద్రోహం చేసిన ప్రభుత్వం దేశంలో ఇదేనేమో మరి. నాడు మూడు పంటలకూ రైతుబంధు ఇవ్వాలని గొంతెత్తిన వాళ్లే.. ఇప్పుడు తామిచ్చిన హామీని సైతం తుంగలో తొక్కుతున్నారు. విచిత్రం ఏమంటే.. దీనికీ ఒక ప్రధాన నియమం పెట్టారు. సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామని. ఇందుకోసం జనవరి 16 నుంచి మూడు రోజుల పాటు దరఖాస్తులు తీసుకొని, ఆ వెంటనే ఓ ఉపగ్రహం ద్వారా సర్వే చేసి, జనవరి 26న రైతు భరోసా వేస్తారంట. ఈ దరఖాస్తుల తంతు ప్రభుత్వం వచ్చిన నాటినుంచి జరుగుతూనే ఉన్నది. ఈ ప్రహసనం అంతా తిరిగి అధికారుల చుట్టూ రైతులు తిరగడానికి, వాళ్లకు లంచాలు సమర్పించుకోవడానికి దారితీస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతూ కష్టపడలేదు. దఫ్తర్‌కు పోకుండా, దరఖాస్తు చేయకుండా వ్యవసాయ పథకాలు అందుకున్నాడు. చివరికి ప్రభుత్వమే కల్లాల దగ్గరికి పోయి పంటను కొనుగోలు చేసింది. ఇప్పుడు రైతులు మళ్లీ క్యూలు కట్టాల్సిన పరిస్థితి రాష్ట్రంల దాపురించింది.

> **ఇక ఇందిరమ్మ ఆత్మీయ భరోసాది మరో అంశం. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ పథకాన్ని కూడా జనవరి 26న శ్రీకారం చుడుతున్నట్టు ప్రకటించింది. రాష్ట్రంలో దాదాపు కోటీ రెండు లక్షల మంది వ్యవసాయ కూలీలున్నారు. ప్రభుత్వం పెడుతున్న మొదటి ఆంక్ష ఏమంటే గుంట భూమి ఉన్నా వ్యవసాయ కూలీ కింద పరిగణించేది లేదట. వారికి రైతు భరోసా వస్తుంది కాబట్టి, ఇందిరమ్మ భరోసా అవసరం లేదన్నది ప్రభుత్వ సూత్రీకరణ. వాస్తవానికి ఎకరం కంటే తక్కువ భూమి ఉన్నవారు రాష్ట్రంలో 24 లక్షల మందికి పైగా ఉన్నారు.**

ఉదాహరణకు ఒక వ్యవసాయ కూలీకి ఐదు గుంటల భూమి ఉంటే అతనికి వచ్చే రైతు భరోసా కేవలం రూ.1500. అంటే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.10,500 నష్టపోవాల్సి వస్తున్నది. 10 గుంటల భూమి ఉన్న కూలీకి రూ.3 వేలుంటే, నష్టపోయే ఆత్మీయ భరోసా రూ.9 వేలు. అంతేకాకుండా రాష్ట్రంలో 50 లక్షల వరకు ఉపాధి హామీ కార్డులున్నాయి. ఈ కార్డులున్న కూలీలు 20 రోజులు పనులకు పోకపోతే.. వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయమని మరో నిబంధన విధిస్తున్నారు. ఈ రకమైన నిబంధనలతో దాదాపు 90% మంది వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించదు. అలాంటప్పుడు ఈ ఆత్మీయ భరోసా ఎవరికో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. ఇలాంటి గుంట చిక్కులతో వ్యవసాయ రంగంలో మళ్లీ కల్లోల పరిస్థితులు తీసుకురావద్దు. రైతుల పట్ల, వ్యవసాయం పట్ల సానుభూతితో వ్యవహరించి ప్రభుత్వం రైతులకు గట్టి భరోసాను అందివ్వాలి. అప్పుడే వ్యవసాయ, దాని అనుబంధ రంగాలు వర్ధిల్లుతాయి.

(వ్యాసకర్త: ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్)

> **రకరకాల నిబంధనలతో దాదాపు 90 శాతం మంది వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తించదు. అలాంటప్పుడు ఈ ఆత్మీయ భరోసా ఎవరికో ప్రభుత్వ పెద్దలే చెప్పాలి. ఇలాంటి గుంట చిక్కులతో వ్యవసాయ రంగంలో మళ్లీ కల్లోల పరిస్థితులు తీసుకురావద్దు.**

# రివర్ లింకింగ్‌తో పర్యావరణ విపత్తు

దేశంలో ప్రస్తుతం నదుల అనుసంధానంపై జోరుగా చర్చ జరుగుతున్నది. నిత్యం జలసవ్వడులతో ఉరికే నదిని, నీరు లేక క్షీణించిపోతున్న నదులతో అనుసంధానం చేయడం ద్వారా ఆయా ప్రాంతాల నీటి కొరతను అధిగమించవచ్చని, సాగును గాడిలో పెట్టవచ్చన్నది దీని వెనకున్న ప్రధాన ఉద్దేశం. లక్ష్యం ఉన్నతమైనదే అయినా అది ఎంతవరకు ఆచరణీయం అన్నదానితో పాటు ప్రకృతికి విరుద్ధంగా వెళ్లడం ఎంతవరకు సబబన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనివల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్న విషయాన్ని రాజకీయ వర్గాలు విస్మరిస్తున్నాయి.

మన ప్రధాని మోదీ గత డిసెంబర్ 25న కెన్-బెత్వా రివర్ లింకింగ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ మధ్య విస్తరించి ఉన్న బుందేల్‌ఖండ్ ప్రాంత నీటి కొరతను తీర్చాలన్న ఉదాత్త లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. అయితే, ఈ ప్రాజెక్టు ప్రతిపాదన దశ నుంచే ఆందోళన వ్యక్తమైంది. ప్రాజెక్టులో భాగంగా పన్నా టైగర్ రిజర్వు ప్రాంతంలో డ్యామ్ నిర్మించనుండటంతో ఆందోళనలు మరింత ఎక్కువయ్యాయి. ఇది పూర్తయితే టైగర్ రిజర్వు మునక తప్పదన్నది పర్యావరణవేత్తల ఆందోళన వెనకున్న కారణం. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే కెన్ నదిలోని మిగులు నీరు కరువు పీడిత బుందేల్‌ఖండ్‌లోని బెత్వా నదిలోకి చేరుతుంది. అయితే, 45 వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును సుప్రీంకోర్టు నియమిత సాధికారిక కమిటీ సభ్యులు సహా నిపుణులు వద్దేవద్దని మొత్తుకున్నా కేంద్రం వినిపించుకోకుండా ముందుకెళ్తున్నది. నీటి కొరతకు నివారణకు అంతర్ బేసిన్ నీటి బదిలీ కోసం నదుల అనుసంధానమే పరిష్కారం అనే భావనను రాజకీయ నాయకులు ప్రచారం చేస్తున్నారు.

నిజానికి నదుల అనుసంధాన ఆలోచన ఇప్పటిది కాదు. కృష్ణా, గోదావరి నదులపై డ్యామ్‌లను డిజైన్ చేసిన సర్ ఆర్థర్ కాటన్ 130 ఏండ్ల క్రితమే ఇంటర్ బేసిన్ ట్రాన్స్‌ఫర్‌ను ప్రతిపాదించారు. దేశం గర్వించదగ్గ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఈ ఆలోచనను మరింత మెరుగుపరిచారు. ఆ తర్వాత కేఎల్ రావు, కెప్టెన్ దిన్షా జే దస్తూర్ వంటి వారు ఈ భావనను మరింత విస్తరించారు. మొదట్లో దీనిని 'నేషనల్ వాటర్ గ్రిడ్' అని పిలిచేవారు. అయితే, ఆ తర్వాత జలవనరుల మంత్రిత్వ శాఖ దీనిని 'నదుల అనుసంధాన ప్రాజెక్టు' (ఐఎల్ఆర్)గా మార్చింది. నదుల అనుంధానంలో భాగంగా తొలుత గంగ-బ్రహ్మపుత్ర నదుల లింకింగ్‌తో మిగులు జలాలను నీటి కొరతతో అల్లాడుతున్న మధ్య, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాలకు మళ్లించాలని భావించారు. 1982లో ఏర్పాటైన నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఐఎల్ఆర్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం మొత్తం 30 లింక్‌లను గుర్తించింది. వీటిని 14 హిమాలయన్, 16 ద్వీపకల్ప నదులుగా విభజించింది. ఇవి వరదలు, కరువు ప్రభావాలను తగ్గించేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాన్ని పెంచేందుకు, వ్యవసాయంలో నీటి కష్టాలను పరిష్కరించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నది.

ఇక, నదుల అనుసంధానం కోసం ప్రస్తుతం అంచనా వేసిన రూ. 5.5 లక్షల కోట్లలో సామాజిక, పర్యావరణ, నిర్వహణ ఖర్చులు కలపలేదు. చివరికి ఈ భారమంతా తిరిగి పన్నుల రూపంలో సామాన్యులపైనే పడుతుంది. అలాగే, హైడ్రోగ్రాఫిక్ వ్యవస్థల్లోని అనియంత్రిత మానవ ప్రేరిత అసమతుల్యత పర్యావరణాన్ని దెబ్బతీస్తుంది. వాతావరణ మార్పు, వర్షపాతం, నదీ ప్రవాహాన్ని ప్రభావితం చేసే మార్పులకు కారణమవుతుంది. అదే జరిగితే భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించకపోవచ్చు.




> **నిజం చెప్పాలంటే విధాన నిర్ణేతలు ఏ నదిలోనూ 'ఉచిత' మిగులు జలాలు లేవన్న అంశాన్ని విస్మరిస్తున్నారు. నదుల ద్వారా మనం సముద్రంలోకి కోల్పోయే నీటిని ఎకో-హైడ్రోలాజికల్ సమస్యగా భావించకూడదు. నదుల అనుసంధాన ప్రాజెక్టులకు మద్దతునిచ్చేవారు, రాజకీయ నాయకులు నదిని డ్రైనేజీ బేసిన్‌లో భాగమన్న విషయాన్ని అర్థం చేసుకోలేరు. లేదంటే ఉద్దేశపూర్వకంగానే దీనిని విస్మరిస్తారు. వరద నీటిని కూడా మనం మిగులు నీటిగా హేతుబద్ధం చేయకూడదు. వరద నీరు భూగర్భ జలాల పునరుద్ధరణకు, జీవవైవిధ్యానికి, కోట్లమంది అట్టడుగు ప్రజల జీవనోపాధికి సహాయపడుతున్నది. దానిని మనం ఆ కోణంలోనే చూడాల్సి ఉంటుంది.**

సముద్రంలోని ఉప్పునీటిని బ్యాలెన్స్ చేయడంలో సహాయపడే డెల్టాలు నదినీటిని మళ్లించడం ద్వారా ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయంలో సింధు నది డెల్టా నుంచి మనం పాఠాలు నేర్చుకోవచ్చని 'ఎంపైర్స్ ఆఫ్ ది ఇండస్: ది స్టోరీ ఆఫ్ ఏ రివర్ (2008) పుస్తకంలో అలైస్ అల్బినియా రాసుకొచ్చారు. ఒకప్పుడు సింధునది వద్ద ఉన్న డెల్టా అప్పట్లో పాకిస్థాన్‌లోనే అత్యంత సంపన్నంగా ఉండేది. అయితే, బ్రిటిషర్లు అక్కడ బరాజ్ నిర్మాణాన్ని ప్రారంభించడం, 1947 తర్వాత పాకిస్థాన్ దానిని కొనసాగించడంతో అనంతరం ఆ ప్రాంతం పేదరికంలోకి జారిపోయినట్టు ఆమె వివరించారు. సర్దార్ సరోవర్ డ్యామ్ పూర్తయ్యాక నర్మదా నది దిగువనున్న ప్రాంతాల పరిస్థితిని ఆధునిక కాలపు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఇంకా చెప్పాలంటే, ఇది మన దగ్గరే కాదు, ప్రపంచ వ్యాప్తంగా ఈ అనుసంధానాలు విపత్తులుగానే మిగిలిపోయాయి. వరదలను తగ్గించేందుకు 1954లో అమెరికా, ఫ్లోరిడా రాష్ట్రంలోని కిస్సిమ్మీ నదీ జలాల మళ్లింపు చేపట్టారు. ఆ తర్వాత ఇది అతిపెద్ద పర్యావరణ విపత్తుగా మిగిలిపోయింది ప్రపంచంలోని అతిపెద్ద సరస్సులలో ఒకటైన అరల్ సముద్రం పరిస్థితి కూడా ఇంతే. సహజ వ్యవస్థలను జియో ఇంజినీరింగ్ ప్రాజెక్టులు ఎలా నాశనం చేస్తాయో చెప్పేందుకు ఇది మరో ఉదాహరణ. సోవియట్ యూనియన్ హయాంలో ఇక్కడ నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టి నీటిని మళ్లించడంతో ఆ తర్వాత ఈ సరస్సు ఎడారిలా మారిపోయింది.

మన విషయానికి వస్తే నీటి సంక్షోభానికి స్వయంకృతాపరాధమే కారణమని చెప్పుకోవచ్చు. నీటి నిర్వహణ సరిగా లేకపోవడం, పర్యావరణానికి సరైన పద్ధతులు అనుసరించకపోవడం, చట్టంలోనూ కొంత అస్పష్టత, అవినీతి కారణంగా నీటి సంక్షోభం అదుపుతప్పుతున్నది. వాటర్‌షెడ్ నిర్వహణ సమర్థంగా ఉండాలి. నీటి వినియోగాన్ని నియంత్రించాలి. సాగునీటి వినియోగానికి రైతులు సమర్థవంతమైన వ్యూహాలను రూపొందిస్తే దీని నుంచి కొంత బయటపడొచ్చు. మురుగునీటి నిర్వహణపై ప్రభుత్వానికి పరిమిత నియంత్రణ మాత్రమే ఉంది. పునర్వినియోగ కార్యక్రమాలను రూపొందించడం ద్వారా కొరతను కొంత అధిగమించవచ్చు.

> **ఇజ్రాయెల్ డ్రిప్ ఇరిగేషన్ విధానం సాగునీటిలో 25 నుంచి 75 శాతం ఆదా చేస్తున్నట్టు 'లెట్ దేర్ బీ వాటర్: ఇజ్రాయెల్ సొల్యూషన్ ఫర్ ఏ వాటర్-స్టార్వ్‌డ్ వరల్డ్' అనే పుస్తకంలో సేథ్ ఎం.సీగెల్ పేర్కొన్నారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ విజయగాథ ఇరిగేషన్ సాంకేతికతను రైతులు అందిపుచ్చుకునేలా చేసింది. ఈ విధానంలో తక్కువ నీరు, తక్కువ ఎరువులు, తక్కువ పురుగు మందులతోనే పంటలు పుష్కలంగా పండించుకోవచ్చు.**

మన ప్రభుత్వం 'హిందుత్వ'ను నొక్కి చెప్తున్నది. నదీమతల్లిని పూజించమని హిందూ విశ్వాసం చెప్తుంది. మన ప్రభుత్వం ఈ రెంటినీ ప్రోత్సహిస్తూనే అందుకు విరుద్ధమైన నదుల అనుసంధానం అనే భావనతో ముందుకు వెళ్తుండటమే ఆశ్చర్యం. ఆనకట్టల ద్వారా నదీగమనాన్ని తారుమారు చేసి, మానవ, పారిశ్రామిక వ్యర్థాలతో ధ్వంసం చేసి, మతపర మార్కెటింగ్ కోసం ముడిసరుకుగా మార్చేసిన మన నదులు ఇప్పుడు అస్తిత్వ ప్రమాదంలో ఉన్నాయి. వాటిని రక్షించేదెవరు?

**- సీపీ రాజేంద్రన్**
**(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (బెంగళూరు) ప్రొఫెసర్)**
**-'ది హిందూ' సౌజన్యంతో...**